## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఘట్‌కేసర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా పట్టణంలోని బాలాజీనగర్‌లో ఉదయం 10.30 నుంచి 11.00 వరకు, కొండాపూర్ గ్రామంలో ఉదయం 10.30 నుంచి 11.00 వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, యంనంపేట్, ఇస్మాయిల్‌ఖాన్‌గూడలో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 4 గంటల వరకు, ఎన్ఎఫ్‌సీనగర్‌లో సాయంత్రం 4.00 నుంచి 4.30 వరకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఘట్‌కేసర్ ఏఈ యశ్వంతకుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## రాజీవ్ స్వగృహ ఇళ్లను పేదలకు కేటాయించాలి


సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం లేదని మాజీ ఎంపీపీ, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఘట్‌కేసర్‌లో ఆయన మాట్లాడుతూ.. గత పేదల ఓట్లతో గెలిచిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. పేదల కోసం ఇళ్లు నిర్మించడానికి ఖాళీ స్థలం కావాలని ప్రభుత్వం ప్రకటించడం మానుకుని అవే ఇళ్లను పేదలకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

## ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ



మేడ్చల్‌రూరల్: గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మునీరాబాద్ గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులు పరుశురామ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షులుగా మహేష్, గౌరవ అధ్యక్షులుగా కుమార్, అధికార ప్రతినిధి రామారావు, మురళీ, ఉపాధ్యక్షులుగా నవీన్, రాజశేఖర్, శేఖర్, ప్రధాన కార్యదర్శిగా బిక్షపతి తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

## సెయింట్ పీటర్స్ కళాశాలకు 'రోడా' అవార్డులు


అవార్డులతో విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల రోడా–2025 అవార్డులు సాధించింది. కళాశాల రోటరాక్ట్ క్లబ్ కమ్యూనిటీ సేవ, వినూత్న ప్రాజెక్టులతో అత్యుత్తమ పనితీరుతో బెస్ట్ క్లబ్ గ్రూప్–3 అవార్డు సాధించింది. క్లబ్ రోటరాక్టర్ తుషార్ అగర్వాల్ స్టార్ ప్రెసిడెంట్, స్టార్ సెక్రటరీగా నామినేట్ అయ్యారు. ఐశ్వర్య బెస్ట్ పబ్లిక్ ఇమేజ్ డైరెక్టర్ అవార్డు పొందగా.. దుర్గి అక్షయ ఉత్తమ మహిళా రోటరాక్టర్ అవార్డు అందుకున్నారు.

## మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సంతోష్

జవహర్‌నగర్: ఇంటర్నేషనల్ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడిగా జవహర్‌నగర్‌కు చెందిన కడవేరు సంతోష్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మారేడ్‌పల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు.

## అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని లోకేశ్వర కాలనీలో వారాహీదేవి ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్పస్వామి ఆలయంలో వారాహీ అమ్మవారి ఆషాడ నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీమంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జవహర్‌నగర్ మాజీ మేయర్ కావ్య, మాజీ కౌన్సిలర్లు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# శివారు రైతుకు చేయూత !

- మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో ఉద్యాన పంటల సాగుపై ప్రభుత్వం దృష్టి
- కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పూలతోటలపై ప్రత్యేక కార్యాచరణ
- శివారు జిల్లాల్లో పంటసాగు పెంపుపై మంత్రి తుమ్మల సమీక్ష
- పలు సంస్థల నెట్‌వర్క్‌తో మార్కెటింగ్‌పై చర్యలు



సాక్షి,సిటీబ్యూరో: నగర శివారుల్లో హార్టికల్చర్ హబ్‌ను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో ప్రస్తుతం సాగవుతున్న ఉద్యాన పంటలను మరింతగా పెంచే దిశగా సంబంధిత ఉద్యానశాఖ అధికారులు కార్యాచరణకు కసరత్తు చేస్తున్నారు.

◆ హైదరాబాద్ శివారుల్లో పండ్లు, కూరగాయలు, పూలను పండిస్తున్న మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లోని రైతులకు తగినంత చేయూతనిచ్చి మరింతగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలకు సిద్ధమవుతోంది.

**ఇటీవల మంత్రి తుమ్మల సమీక్ష..**

హైదరాబాద్ నగర శివారు జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు పెంపుపై దృష్టి పెట్టాల్సిన అంశాలపై ఇటీవల సచివాలయంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరానికి అవసరమైన కూరగాయలను మన దగ్గరే పండించేలా రైతులను ప్రోత్సహించాలని, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు.

**దిగుమతి చేసుకోవడం బాధాకరం..**

కూరగాయలు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవటండం బాధాకరమని మంత్రి చెప్పారు. డిప్యూటీ, జాయింట్ డైరెక్టర్ స్థాయి అధికారులకు జిల్లాలకు కేటాయించి, కలెక్టర్లు, అధికారులతో సమన్వయం చేసుకుని, కూరగాయల సాగును పెంచేలా రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రధాన వ్యాపార కేంద్రంగా మార్కెటింగ్‌కు అనుకూలంగా ఉందని సూచించారు.

**తాజా కూరగాయలు అందించొచ్చు..**

శివారు ప్రాంతాల రైతులకు ఆదాయంతో పాటు హైదరాబాద్ నగర వాసులకు తాజా కూరగాయలను అందించొచ్చని మంత్రి పేర్కొన్నారు.

**87 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు**

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 12 వేల ఎకరాలు, రంగారెడ్డి జిల్లాల్లో 75 వేల ఎకరాల్లో రైతులు ప్రస్తుతం ఉద్యాన (కూరగాయలు, పండ్లు, పూలు) పంటలను సాగు చేస్తున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటల ఉత్పత్తులను ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తున్న రైతులు మాత్రం బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌తో సహా నగర సమీపంలోని రైతు బజార్లలో విక్రయిస్తున్నారు.

**హార్టికల్చర్ హబ్‌పై..**

జిల్లాలో 99 వేల ఎకరాల వ్యవసాయ (పంట సాగు) భూమి ఉండగా.. ఇందులో 12 వేల ఎకరాల్లో మాత్రమే ఉద్యాన పంట సాగు చేస్తున్నారు. మరో 18 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. దశల వారీగా అదనంగా 30 వేల ఎకరాల్లో ఉద్యాన (హార్టికల్చర్) పంటసాగు చేయొచ్చని సంబంధితశాఖ అంచనా వేస్తోంది.

◆ ప్రతి ఏటా 8 నుంచి 10 వేల ఎకరాల చొప్పున దశల వారీగా 30 వేల ఎకరాల్లో హార్టికల్చర్ పంట సాగును పెంచొచ్చని పేర్కొంటుంది. దీనికి సుమారుగా రూ.250 కోట్లు ఖర్చవుతాయని అధికారుల అంచనా.

**ఉద్యాన ఉత్పత్తుల రవాణాకు..**

నగర శివారు జిల్లాల నుంచి హైదరాబాద్‌తో సహా బెంగళూరు, చెన్నై, ముంబాయి తదితర నగరాలు లక్ష్యంగా పలు సంస్థలతో పండ్లు, కూరగాయలు, పూలను రవాణా చేసేందుకు నెట్‌వర్క్ ఏర్పాటుపై సంబంధిత శాఖలు కసరత్తు చేస్తున్నాయి.

## అమ్మవారి సేవలో ఎంపీ ఈటల


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని వారాహీ అమ్మవారి ఆలయంలో కొనసాగుతున్న గుప్త నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం ఎంపీ ఈటల రాజేందర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారి ఆశీస్సులతో పాటు, మహాప్రసాదాన్ని ఎంపీకి అందజేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, ఏనుగు సుదర్శన్‌రెడ్డి, నాగారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగరాజు, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, జూపల్లి సురేష్, బలరాం, బైరెడ్డి మల్లారెడ్డి, మేడ్చల్ మహిళా మోర్చా అధ్యక్షురాలు లక్ష్మి, నాగారం మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి పాండే, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ఇందిరానెహ్రూనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. ఇందిరానెహ్రూనగర్‌లో గత కొంతకాలంగా పవర్ బోర్లు లీకేజీలతో నీటిసరఫరా సక్రమంగా జరగడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కార్పొరేటర్ శుక్రవారం ఇందిరానెహ్రూనగర్ కాలనీలో పర్యటించారు. పవర్‌బోర్ లీకేజీలను పరిశీలించారు. సొంత నిధులతో మరమ్మతులు చేయిస్తానని కాలనీవాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నేతలు మేకల రాముయాదవ్, బైరు అనీల్, అనిత, సిద్ధిరాములు, కావలి శ్రీనివాస్, మర్రి శ్రీనివాస్, నాగేష్‌గౌడ్, మల్లేష్, రాజా, అశోక్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామి వివేకానందుడి జీవితం యువతకు స్ఫూర్తి


అవుషాపూర్‌లో నివాళులర్పిస్తున్న సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: స్వామి వివేకానందుని జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వివేకానంద వర్ధంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ సంస్కృతి సాంప్రదాయాల కోసం శ్రమించి చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, లక్ష్మణ్ యాదవ్, సదానందరెడ్డి, మశ్చేందర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బాలుయాదవ్, భానుయాదవ్, సాయిలు, మహేష్, కృష్ణయాదవ్, రమేష్, నరేష్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్ స్థానికులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి

శామీర్‌పేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తూంకుంట మున్సిపల్ కమిషనర్ జ్యోతి అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ ఉప్పరపల్లిలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎక్సలెన్సీ కళాశాల ఆధ్వర్యంలో వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పర్‌పల్లిలోని పాఠశాల, దేవాలయాల ప్రాంగణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జూలై 1 నుంచి 7 వరకు ప్రభుత్వం వనమహోత్సవం నిర్వహిస్తుందని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్, ఎంఈఓ కమలాకర్, మాజీ సర్పంచ్ రవీందర్, మున్సిపల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యస్వామి పాల్గొన్నారు.

### కలెక్టరేట్‌లో మాజీ సీఎం రోశయ్య జయంతి

సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్‌లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కె.రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఆర్‌ఓ హరిప్రియ పాల్గొని రోశయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### స్కూల్ బస్సుకు ప్రమాదం

మేడ్చల్‌రూరల్: పట్టణంలోని ఓ స్కూల్ బస్ శుక్రవారం ఉదయం ప్రమాదానికి గురైంది. ప్రమాద సమయంలో బస్సులో విద్యార్థులు ఉండగా.. ఎవ్వరికీ గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం ఉదయం మనోహరబాద్ మండలంలోని దండుపల్లి నుంచి విద్యార్థులతో బస్సు మేడ్చల్‌కు వస్తుండగా మార్గమధ్యలోని డబిల్‌పూర్ చౌరస్తా వద్ద 44వ జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో స్కూల్ బస్సు లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. బస్సు వెనకాల ఉన్న రెండు కార్లు బస్సును ఢీ కొట్టాయి. ప్రమాద సమయంలో 30 మందికి పైగా విద్యార్థులు బస్సులో ఉన్నట్లు సమాచారం. స్కూల్ యాజమాన్యం వెంటనే మరో వాహనంలో విద్యార్థులను స్కూల్‌కు తరలించారు. ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోయాయి.

## పటేల్‌కుంట చెరువును సుందరీకరిస్తాం



మల్లాపూర్: నాచారం పటేల్‌కుంట చెరువును త్వరలోనే సుందరీకరిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం గుర్రపుడెక్క, లార్వా నిర్మూలనకు డ్రోన్ యంత్రంతో స్ప్రే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటేల్‌కుంట చెరువులోకి మురుగు చేరకుండా పైపులైన్ పనులు చేపడతామన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి, కాప్రా సర్కిల్ ఎంటమాలజిస్ట్ రమేష్, మాధవరెడ్డి, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ సభకు తరలిన నేతలు


నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీలలో...


ఘట్‌కేసర్‌లో...

కీసర: ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే సారథ్యంలో నిర్వహించిన 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' కార్యక్రమానికి నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల నుంచి పెద్ద ఎత్తున కాంగ్రెస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. నాగారం మున్సిపల్ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, దమ్మాయిగూడ మున్సిపల్ పట్టణ అధ్యక్షులు ముప్పు రామారావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ సభ్యురాలు ఈగ శ్వేతానాగరాజు, నాగారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, దమ్మాయిగూడ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్, కీసర మండల అధ్యక్షులు కృష్ణయాదవ్, నేతలు రమేష్‌గుప్తా, కందాడి శ్రావణ్‌రెడ్డి, జంగయ్యయాదవ్ తదితరులున్నారు.

ఘట్‌కేసర్: ఎల్‌బీ స్టేడియంలో శుక్రవారం జరిగిన కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుల సమ్మేళనానికి కాంగ్రెస్ మున్సిపల్‌శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ముత్యాలుయాదవ్, రాధాకృష్ణముదిరాజ్ ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. పట్టణంలోని శివారెడ్డిగూడ వరకు ర్యాలీ నిర్వహించారు. బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, జంగయ్యయాదవ్, ఫరూక్, ఖయూమ్, సిరాజ్ పాల్గొన్నారు.

## తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య




నాగారంలో..

సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని డీఆర్‌ఓ హరిప్రియ అన్నారు. శుక్రవారం మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ జేఎల్‌బీ. హరిప్రియ జ్యోతి ప్రజ్వలన చేసి, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. బీసీ అభివృద్ధిశాఖ జిల్లా అధికారి ఝాన్సీరాణి, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్‌కుమార్, కలెక్టరేట్ ఏఓ రామ్మోహన్, కురుమసంఘం జిల్లా నాయకులు చీర సురేష్ కురుమ, వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మేడ్చల్: తెలంగాణ విముక్తి కోసం పోరాటం చేసి తొలి అమరుడైన దొడ్డి కొమురయ్య వర్ధంతిని మేడ్చల్‌లో కురమసంఘం నాయకులు, కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద కొమురయ్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నేతలు వేముల శ్రీనివాస్‌రెడ్డి, కొడె మహేష, సత్యనారాయణ, మల్లేష్‌గౌడ్, శంకర్, బాలప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో దొడ్డి కొమురయ్య వర్ధంతిని నిర్వహించారు. నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, స్థానిక నాయకులు, కురుమసంఘం నాయకులు పాల్గొన్నారు.


మేడ్చల్‌లో..

## అనుమానం పెనుభూతమై..

### భార్య గొంతు నులిమి హత్య చేసిన భర్త


హత్యకు గురైన ప్రశాంతి

మేడ్చల్‌రూరల్: అనుమానం పెనుభూతమై భార్యపై అనుమానంతో భార్యను హత్య చేసిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. మేడ్చల్ ఏసీపీ శంకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరు మండలం ముప్పల గ్రామానికి చెందిన రాంబాబుతో ప్రశాంతి (22)కి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. వీరికి 5 నెలల పాప ఉంది. రాంబాబు తాపీమేస్త్రీగా పనిచేస్తున్నాడు. కాగా నెల రోజుల క్రితం మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌పరిధిలోని కేఎల్ఆర్–ఏజేఆర్‌నగర్‌లో ఇల్లు అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. పెళ్లైనప్పటి నుంచి రాంబాబు ప్రశాంతిని అనుమానంతో వేధిస్తున్నాడు. ఈ విషయమై తరుచుగా ఇరువురి మధ్య గొడవలు జరుగుతుండేవి. కుటుంబ పెద్దలు ఇరువురికి నచ్చచెబుతూ.. వచ్చారు. గురువారం రాత్రి ఇరువురి మధ్య గొడవ జరగడంతో భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. చనిపోయిందని నిర్ధారించుకుని పాపను వదిలేసి పారిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులు రాంబాబుకి ఫోన్ చేయగా.. ఫోన్ స్విఛాఫ్ వచ్చింది. వారు ఇంటికొచ్చి చూసే సరికి భార్య మృతి చెంది ఉంది. పాప పక్కన ఏడుస్తూ కనిపించింది. వెంటనే వారు పోలీసులకు సమాచారం అందించారు.

**హత్యగా నిర్ధారణ..**

అనుమానాస్పద స్థితిలో ప్రశాంతి అనే మహిళ మృతి చెందిన సమాచారం అందుకున్న ఏసీపీ శంకర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, డీఐ సుధీర్‌కృష్ణ, ఎస్సైలతో కలిసి ఘటనా స్థలాన్ని సందర్శించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించి, భార్యను భర్త రాంబాబు హత్య చేసినట్టు నిర్ధారించారు. భార్య గొంతుపై ఉన్న గుర్తులను భట్టి భర్త గొంతు నులిమి చంపినట్టు భావిస్తున్నామన్నారు. క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలను సేకరించామని తెలిపారు.

## గుర్తు తెలియని వృద్ధుడి మృతి

ఉప్పల్: గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మహంకాళి దేవాలయం వద్ద గుర్తు తెలియని వృద్ధుడు (70 ) అపస్మారక స్థితిలో పడిఉన్నాడని, స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే అతడు మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయండి


అధికారుల సమావేశంలో కలెక్టర్ మనుచౌదరి


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సాక్షి,సిటీబ్యూరో: భూ భారతి, రేషన్‌కార్డులు, ఎల్ఆర్ఎస్‌లో పేరుకపోయిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన చోట మీ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో భూ భారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ ఎస్ అంశాలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని మండలాల, మున్సిపాలిటీల వారిగా భూ భారతి, రేషన్ కార్డులు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో ఎదురౌతున్న ఇబ్బందులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూ వివాదాలకు సంబంధించిన కోర్టు కేసులు, లిటిగేషన్‌లో ఉన్న ప్రభుత్వ భూముల ఫిజికల్ పొజిషన్ పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టరు సూచించారు. త్వరితగతిన రేషన్‌కార్డులు పరిశీలించి అర్హులైన వారికి మంజూరు చేయాలన్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు సంబంధించి రుసుం చెల్లించిన వారికి ప్రొసిడింగ్స్ అందించాలన్నారు. సమస్యాత్మకంగా ఉన్న దరఖాస్తులకు సంబంధించిన వివరాలను తనకు అందించాలని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు కూడా చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా అదనపు కలెక్టర్లు రాధికా గుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాం ప్రకాష్, జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తాం**

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టాపూర్‌లోని సాంఘిక సంక్షేమశాఖ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థుల కోసం అన్ని వసతులు కల్పిస్తామని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి స్కూల్‌లో వసతులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో డ్రైనేజీ వ్యవస్థ, అదనపు టాయిలెట్లు, సైన్స్‌ల్యాబ్ ఏర్పాటు చేయాలని కోరడంతో వారి కోరిక మేరకు అన్ని ఏర్పాట్లు చేయిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి ఇష్టంతో చదువుకుని బంగారు భవిష్యత్ నిర్మించుకోవాలన్నారు. విద్యార్థులతో ఆయన మాట్లాడి భోధన, వసతులపై ఆరా తీశారు. భోజనశాలలో మరిన్ని టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. టాయిలెట్లు, దోమల నివారణకు మెష్ డోర్‌ల ఏర్పాటు, ఫ్లోరింగ్ తదితర పనులు చేపట్టేందుకు ప్రణాళికను తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు.